క్లుప్తంగా

బాలాజీని కలిసిన దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా


బాలాజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న రామయ్య

పర్చూరు (యద్దనపూడి): బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీని శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జగనన్న పాలనలో దివ్యాంగులు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. మళ్లీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు డేవిడ్ మనోహర్, తుళ్లూరి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో కార్యాలయంలో కంట్రోల్ రూం

చీరాల టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల సూచనలు, ఫిర్యాదుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చీరాల ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రజలు తమ ఫిర్యాదులు, సూచనలను 90597 51950 ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని ఆర్వో సూచించారు. కంట్రోల్ రూం 24 గంటలు పని చేస్తుందన్నారు.


పట్టా అందిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ (ఫైల్)


మౌలిక వసతులతో స్వర్ణ రైతు భరోసా కేంద్రం


సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన స్వర్ణ సచివాలయ భవనం


అందరికీ అందుబాటులో ఉండేలా స్వర్ణ డిజిటల్ లైబ్రరీ

అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి

- గత ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధిలో పోటీ
- ఒక ఊరుకు మించి మరో ఊరిలో అభివృద్ధి పనులు
- మండలంలో రూ.231 కోట్ల లబ్ధి
- మళ్లీ జగనన్నకే జై అంటున్న పేద ప్రజలు

కారంచేడు: ఒకప్పుడు గ్రామాల్లో అభివృద్ధి అంటే ఎక్కడో ఒక చోట అల్లంత దూరానా కనబడేవి. గత పాలకులు కేవలం గ్రాఫిక్స్, తన వాళ్ల అభివృద్ధికి చూపించినంత శ్రద్ధ గ్రామాలపై పెట్టలేదు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. సరిగా ఈతరుణంలోనే 2019లో జగన్ మోహన్ రెడ్డి సీఎంగా పాలనా పగ్గాలు చేపట్టాక గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నేడు కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడేలా చేస్తూ సుపరిపాలన అందజేస్తున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయి, ఎంతో మంది పాలకులు వచ్చారు. అయినా అప్పుడు లేని అభివృద్ధి ఇప్పుడు కనిపిస్తుందంటే ఇప్పుడున్న ప్రభుత్వం చిత్తశుద్ధి అది. సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలకు ప్రజలు జేజేలు కొడుతున్నారు. గతంలో ఎన్నడూ వినని పథకాలు నేడు ప్రజల ఇంటి ముంగిటకు వచ్చి తలుపులు తడుతున్నాయి. నియోజకవర్గంలోని కారంచేడు మండలంలోని గ్రామాలు అభివృద్ధిలో పోటీ పడుతున్నాయి.

కోట్ల ఖర్చుతో గ్రామాల అభివృద్ధి..

కారంచేడు మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 11 గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాయి. సచివాలయ పరిధిలోని గ్రామస్తులకు అవసరమైన గ్రామ సచివాలయ భవనాలు, రైతు బరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, పాలకేంద్రాల వంటి శాశ్వత భవనాలు నేడు దర్శనమిస్తున్నాయి. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలోను ఒక్కో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రూ 23.94 లక్షలు, ఒక్కో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ 20.80 లక్షలు, ఒక్కో పాలకేంద్రం నిర్మాణాలకు రూ.17.67 లక్షలు, ఒక్కో సచివాలయ భవనం నిర్మాణానికి రూ.43.06 లక్షలు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలకు రూ 16.01 లక్షలను వెచ్చించి సర్వాంగ సుందరంగా, అన్ని రకాల మౌళిక వసతులతో భవనాలు తయారుచేశారు. కేవలం ఈ భవన నిర్మాణాలకు ఒక్కో గ్రామంలో ఈ ప్రభుత్వం రూ 1.22 కోట్లు ఖర్చు చేస్తుంది. ఇవి కాకుండా నాడు-నేడు ద్వారా మండలంలోని కారంచేడు, స్వర్ణ, దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి, భవనాల రూపురేఖలను మార్చివేసింది. అలాగే రెండు దశల ద్వారా మండలంలోని 14 గ్రామాల పరిధిలో మొత్తం 32 పాఠశాలలకుగాను 20 పాఠశాలలు నాడు-నేడు ద్వారా, ఒకటి నాబార్డు నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి అవుతున్నాయి. ఒక్కో ప్రాథమిక పాఠశాలకు రూ.12 లక్షలు, ఉన్నత పాఠశాలకు రూ.63 లక్షల చొప్పున నిధులు వినియోగిస్తున్నారు. జగనన్న కాలనీల నిర్మాణాలకు అవసరమైన స్థలాలు పరిశీలించి నిధులు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేలా పాలకులు, అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.231 కోట్లు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో చేరిందంటే అతిశయోక్తి కాదు.


తిమిడెదపాడులో ఎల్‌ఈడీల ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులు

> **జగనన్న పాలనలో పేద ప్రజలు సుభిక్షంగా ఉన్నారు..**
>
> 
>
> గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి అందించిన సుపరిపాలన నేడు ఆయన తనయుడు, మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారు. జగనన్న పాలనలో పేద ప్రజలందరూ ఎంతో సంతోషంగా సుభిక్షంగా ఉన్నారు. గతంలో ఏ పని ఉన్నా ప్రభుత్వ అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదిక్షణలు చేయాల్సి వచ్చేది. నేడు గడప వద్దకే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పాలన అందుతోంది.
>
> – యడం బాలాజీ, వైఎస్సార్ సీపీ, పర్చూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి

> **వైఎస్సార్ ఆసరా పథకం మా కుటుంబాలకు ఎంతో ఆసరా**
>
> 
>
> వైఎస్సార్ ఆసరా పథకంతో మా కుటుంబానికి ఎంతో ఆసరా ఉంది. గత ప్రభుత్వాలు ఎప్పుడు చేయని విధంగా పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్న జగనన్న పాలనలో మేము చాలా సంతోషంగా ఉన్నాం. నేను ప్రభుత్వం నుంచి తీసుకున్న ఆసరా నిధులతో పాడి గేదెలను కొనుగోలు చేసుకున్నాను. పాల వ్యాపారంతో మా కుటుంబ పోషణ సంతోషంగా ఉంది. గతంలో డబ్బుకు ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు.
>
> – గర్నెపూడి ఇమాంజలీ, అంబేద్కర్‌నగర్ కాలనీ, కారంచేడు

మండలంలో అందించిన సంక్షేమ పథకాలు (డీబీటీ)

పథకం	లబ్ధిదారులు	నగదు (కోట్లలో)
జగనన్న అమ్మఒడి	3184	13.19
జగనన్న విద్యాదీవెన	2596	09.98
జగనన్న వసతిదీవెన	2011	03.28
రైతు భరోసా	6814	33.76
పంటల బీమా	2740	05.90
సున్నావడ్డీ పంట రుణాలు	2107	5.56
ఇన్‌పుట్ సబ్సిడీ (రైతులకు)	159	1.54
మత్స్యకార భరోసా	5	60 వేలు
వైఎస్సార్ పెన్షన్ కానుక	6784	68.67
వైఎస్సార్ చేయూత	2443	12.12
వైఎస్సార్ ఆసరా	8330	27.06
సున్నావడ్డీ (మహిళలకు)	9969	05.29
కాపు నేస్తం	514	02.18
ఈబీసీ నేస్తం	842	02.26
కల్యాణమస్తు	11	10 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	1383	06.96
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	938	07.31
హౌసింగ్ (డీబీటీ)	38	49 లక్షలు
వైఎస్సార్ బీమా	103	01.28
వాహనమిత్ర	125	34 లక్షలు
చేదోడు	216	48 లక్షలు
కోవిడ్ సాయం	11007	11.07
జగనన్న తోడు వడ్డీ	875	39 లక్షలు
నాన్ డీబీటీ		
ఇళ్ల స్థలాలు	559	రూ. 11.23
విద్యాకానుక	1593	01.34
ట్యాబ్స్	303	32 లక్షలు
జగనన్న తోడు రుణాలు	1432	02.67
గోరుముద్ద	1550	01.54
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	2034	03.90
రైస్ కార్డులు	6231	13.62
మొత్తం	రూ.230.68 కోట్లు	

ముస్లింలకు మేలు చేసింది సీఎం జగనే

- ఇఫ్తార్ విందులో పాల్గొన్న యడం బాలాజీ


మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న యడం బాలాజీ

చినగంజాం: రాష్ట్రంలో ముస్లింలకు ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేలు చేసి అన్ని రకాలుగా ఆదుకుందని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. చినగంజాంలో శనివారం రాత్రి ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మాట్లాడారు. ముందుగా స్థానిక మసీదులో నిర్వహించిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు ఎంతో మేలు చేశారని, పాలనాపరమైన అంశాలలో వారికి పెద్ద పీట వేశారని, శాసనసభ సీట్లు మొదలుకొని అన్నింటిలో వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మసీదులో మౌజమ్‌లకు గౌరవ వేతనం, షాదీతోఫా వంటి పథకాలను అందించి ఆదుకున్నారని, ముఖ్యంగా కరోనా సమయంలో వారు ఇబ్బందులకు గురికాకుండా ఆర్థికంగా సాయమందించారన్నారు. పాదయాత్రలో ఆయన ఇచ్చిన హామీలతో మొత్తం 33 పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ముస్లింలకు సాయమందిస్తానని, ఎప్పుడు వచ్చి తన తలుపు తట్టినా వారికి కావాల్సిన సాయాన్ని అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మసీదులో రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్ష కోసం హాలు అవసరమని, మసీదు మరమ్మతులకు నిధులు కావాలని వారు ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. వాటిని ఆయన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. ముస్లిం సాంప్రదాయ రీతిలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, హబీబుల్లా, సయ్యద్ షకీల్ అహ్మద్, మీర్‌సా బాబు, షేక్ మహ్మద్ రషీద్, వక్ఫ్ బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, కొల్లాటి ఏడుకొండలు, కొండూరి గోవింద్, పాదర్తి ప్రకాష్, వీవీఆర్ ప్రసాద్, షేక్ మహ్మద్‌షా, మేడికొండ బాబురావు, అల్లడి శ్యాంబాబు, టీ తిరుపతిరావు, ఇసూబ్, సుభానిబాబు,సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


ముస్లింలకు ఇఫ్తార్ విందు వడ్డన చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ

చేనేతలకు అండగా ఉంటాం..

- నియోజకవర్గ చేనేత ఆత్మీయ సమావేశం
- పాల్గొన్న వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం


కరణం వెంకటేష్‌కు సంఘీభావం వ్యక్తం చేస్తున్న చేనేత ప్రతినిధులు

చీరాల రూరల్: చేనేతలకు ఏ సమస్య వచ్చినా అన్నివేళలా వారికి అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. నియోజకవర్గ చేనేత సంఘీయులు ఆత్మీయ సమావేశం శనివారం రాత్రి పద్మశాలీయ బహుత్తమ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా కరణం వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. చీరాలంటే చేనేతని, చేనేతంటే చీరాలని యావత్ ప్రపంచంలో చేనేత రంగానికి ఎనలేని ప్రాముఖ్యమున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేనేత రంగానికి చేసిన కృషి అమోఘమన్నారు. 50 ఏళ్లకే చేనేత ఫించన్‌లు, నేతన్న నేస్తం పథకం చేనేతలకు ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. ఆయన రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి పథంలో పయనింపచేశాడని కొనియాడారు. 2019 ముందు చీరాలలో పరిస్థితితులు ఎలా ఉండేవో ఆ తరువాత తన తండ్రి ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి వచ్చిన తరువాత పరిస్థితులు ఎలా ఉన్నాయో చీరాల ఎంత ప్రశాంతంగా ఉందో ప్రజలు గమనించి ఓట్లు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలపరచిన అభ్యర్థిగా తనను మీ కుటుంబ సభ్యులలో ఒకడిగా గుర్తించి అమూల్యమైన ఓట్లు తనకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో చేనేతలకు కేటాయించిన టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని గతంలో పనిచేసిన ఎమ్మెల్యే ఇళ్ల స్థలాలుగా మార్చబోతుంటే కోర్టులో న్యాయ పోరాటంచేసి తిరిగి చేనేతలకు అప్పగించిన ఘనత తన తండ్రి ఎమ్మెల్యే కరణం బలరాంకే దక్కిందన్నారు. చైర్మన్ మాట్లాడుతూ అలానే చీరాలకే చెందిన బీరక సురేంద్రకు దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇలా చెప్పుకుంటూ పోతే చీరాలలోని బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారని అందులో కరణం బలరామ కృష్ణమూర్తి పాత్రకూడా చాలా ఉందని చెప్పారు. ఆయన తనయుడు కరణం వెంకటేష్‌ను, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని ముఖ్యమంత్రి జగనన్నకు కానుకగా ఇస్తామని చెప్పారు. కార్యక్రమానంతరం కరణం వెంకటేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చేనేత కౌన్సిలర్లు గోలి స్వాతి, గోలి జగదీష్, దాసరి రామకృష్ణ, తోకల అనిల్ కుమార్, బత్తుల అనిల్, కీర్తి వెంకట్రావు, బండారు బాల, మామిడాల సుబ్బారావు, డాక్టర్ జివి. పున్నారావు, బండారు జ్వాలా నరసింహరావు, చిలుకోటి శ్రీనివాసరావు, గోలి గంగాధర్, సాంబశివరావు, గోలి గిరికుమార్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ తిరునాళ్లకు అంకురార్పణ


ధ్వజారోహణ పతాకావిష్కరణ చేస్తున్న దాత, దేవాలయ అధికారులు


లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పతాకావిష్కరణ చేస్తున్న అధికారులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ, పోలీసు అధికారులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, క్షేత్రపాలకుడైన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల 69వ వార్షిక తిరునాళ్లకు శనివారం ధ్వజారోహణతో అంకుర్పాణ చేశారు. తొలిరోజులో భాగంగా ఉదయం దేవాలయాల్లో గణపతి పూజ, పుణ్యాహవచన, అఖండదీప స్థాపన, మండపారాధన నిర్వహించారు. ధ్వజస్తంభ దాతలు శంకరరెడ్డి ధ్వజారోహణంలో పాల్గొని పతాకావిష్కరణ చేశారు. అదేవిధంగా క్షేత్రపాలకుడు కొండపైన లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో ఈవో కోటిరెడ్డి, దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ ఎస్ కొండలు ధ్వజరోహనలో భాగంగా పతాకాన్ని ఆవిష్కరించారు. రెండోరోజు ఆదివారం స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తారు. సోమవారం ప్రధాని తిరునాళ్ల సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఉదయం నుంచి భక్తుల దర్శించుకుంటారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి అయినట్లు సహాయక కార్యదర్శి టి. సుభద్ర తెలిపారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అడిషనల్ ఎస్పీ..

ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా దేవస్థానం వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ శనివారం పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు లోబడి సోమవారం జరిగే ప్రధాన తిరునాళ్లలో ప్రభలు కట్టే నిర్వాహకులు కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ప్రభలపై రాజకీయ పార్టీల జెండాలు, అసభ్యకర నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదన్నారు. దేవాలయ ప్రాంగణం, ప్రవేశమార్గాలు, క్యూలైన్‌లు , ప్రభలు నిలిపే స్థలాలు, ఎగ్జిబిషన్ జరిగే స్థలాలు పరిశీలించారు. రెవెన్యూ, పోలీస్ శాఖ సమన్వయంగా పనిచేస్తూ తిరునాళ్ల ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. తిరునాళ్ల సందర్భంగా ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు మేదరమెట్ల పైలాన్ నుంచి ముప్పవరం మీదుగా మార్టూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా హైదరాబాద్‌కు దారి మళ్లించారు. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు నుంచి వచ్చే వాహనాలు సంతమాగులూరు అడ్డరోడ్ నుంచి నరసరావుపేట, చిలకలూరిపేట, మార్టూరు, మేదరమెట్ల మీదుగా ఒంగోలుకు, కడప వైపు నుంచి విజయవాడ వెళ్లుటకు పొదిలి, చీమకుర్తి, ఒంగోలు మీదుగా విజయవాడ వెళ్లటానికి దారి మళ్లించనున్నట్లు తెలిపారు.

ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి


కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించటమే లక్ష్యంగా పనిచేయాలని పోలీస్ సిబ్బందికి అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ సూచించారు. శనివారం మండలంలోని కుందుర్తి గ్రామాన్ని సందర్శించారు. అనంతరం కేంద్ర సాయుధ బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ భయాందోళన వీడి రాజ్యాంగం మనకిచ్చిన ఓటు హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. సంతమాగులూరు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో సంతమాగులూరు సీఐ నరసింహారావు, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

చినగంజాం: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐ ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని పెదగంజాంలోని గ్రామాలతో పాటు రాజుబంగారుపాలెం పంచాయతీలోని రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం గ్రామాలలో కవాతు నిర్వహించారు.

ట్రాఫిక్ నియమాలతో ప్రమాదాలకు చెక్


ట్రాఫిక్ నియమాలను వివరిస్తున్న సీఐ

చీరాల టౌన్: వాహనాలు నడిపే వారు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని ఒన్‌టౌన్ సీఐ ఎం.శేషగిరిరావు సూచించారు. శనివారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు, ముంతావారి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆటో, కారు, లారీ, బస్సు, వ్యాన్ డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్లు ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతు వాహనాలు నడుపరాదన్నారు. కార్లు నడిపే వారు తప్పకుండా సీట్‌బెల్ట్ ధరించే వాహనాలు నడపాలన్నారు. ఆటో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, వాహనాల డ్రైవర్లు ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి అవసరం

చీరాల: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ కె.చక్రధర్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. తడి, పొడి చెత్త సేకరణ, ఎంఆర్‌ఎఫ్ సెంటర్ నిర్వహణ, పారిశుద్ధ్య అంశాలపై మాట్లాడారు. అలానే డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ 2024-25 సంవత్సరానికి సంబంధించి 25 శాతం అపరాధ రుసుముతో ఈనెల 31వ తేదీ లోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చక్రధర్

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాలు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో కామ్రేడ్ భగత్ సింగ్ 93 వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గన్నవరం రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐఎమ్ఎల్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ భాషా, ఉప్పలపాటి అచ్యుతరామరాజు, సాయిబాబ, కాజా పటాన్ బాబు క్రాంతి, సీమ సుజాత పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

పర్చూరు (యద్దనపూడి): మండల పరిధిలోని దేవరపల్లిలో పట్టపగలు పూరిల్లు కాలిపోయింది. జూపూడి రోశయ్యకు చెందిన పూరింట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. చుట్టు పక్కల వారు మంటలు ఆర్పేందుకు తీవ్రంగా కష్టపడినా ఫలితం లేకుండా పోయింది. ఇది ఎవరో ఆగంతకులు సిగిరెట్ కాల్చి నిర్లక్ష్యంగా పడవేయటంతో ఈఘటన జరిగి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న నాలుగు బీరువాలు, అందులో ఉన్న బట్టలు, సర్టిఫికెట్లు, ఇతర విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

28 మందిపై బైండోవర్

బల్లికురవ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో అల్లర్లు, అలజడులు, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఐదు గ్రామాల్లో శనివారం 28 మందిని బైండోవర్ చేసుకున్నట్లు తహశీల్దార్ ఎం సుభద్ర తెలిపారు. ఉప్పుమాగులూరులో 13 మంది వేమవరంలో 9 మంది, కొణిదెనలో 4, చెన్నుపల్లి, కొప్పరపాడులో ఒకరి చొప్పున అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

26న చీరాలలో దివ్యాంగులకు వైద్యశిబిరం

చినగంజాం: మండలంలోని దివ్యాంగ విద్యార్థులకు ఈనెల 26వ తేదీ మంగళవారం చీరాల ఎస్‌ఆర్‌పీఎం బాయ్స్ హైస్కూల్‌లో సీడబ్లూఎస్‌ఎన్ మెడికల్ అసెస్‌మెంట్ క్యాంప్ నిర్వహించనున్నట్లు చినగంజాం భవిత కేంద్రం మండల ఐఆర్టీటీ బాలకృష్ణ తెలిపారు. వైద్య శిబిరంలో దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన హియరింగ్ బడ్స్, వీల్ చైర్స్, స్ట్రక్చర్స్, మెంటల్లీ రిటార్డెడ్ కిట్స్, ట్రై సైకిల్ అవసరమైన విద్యార్థులను మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శిబిరానికి పంపించాల్సిందిగా ఆయన కోరారు. శిబిరానికి వచ్చేవారు రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, సదరం మెడికల్ సర్టిఫికెట్ రెండు జిరాక్స్ కాపీలు తీసుకు రావాల్సిందిగా సూచించారు. పూర్తి సమాచారం కోసం ఐఆర్టీటీ బాలకృష్ణ 9866 437809, డీ నాగార్జున 96767 46542 నంబర్లలో సంప్రదించాలని కోరారు.